www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 10 జులై 2024



శతాధిక వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పెద్దూరు కస్పా కురమలకు చెందిన శతాధిక వృద్ధురాలు షేక్‌బాబి (120) మంగళవారం మృతి చెందారు. 1904లో జన్మించిన ఆమె గృహిణిగా ఉన్నారు. ఆమె భర్త మొహిద్దీన్ సాబ్ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఏడుగురు కుమార్తెలు ఉన్నారు. మనవళ్లు, మనవరాళ్లు, ఇతర కుటుంబ సభ్యుల సంఖ్య వందకుపైగానే ఉన్నారు. షేక్‌బాబి మృతి చెందిన విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బంధువులు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని మెడికల్ షాప్ యజమాని ఆమీన్ పరామర్శించి, సానుభూతి తెలియజేశారు.



షేక్‌బాబి (ఫైల్‌ఫోటో)

వాడివేడి

- ఉచిత ఇసుక ఉత్తిదే!
- వంట ఏజెన్సీ, వార్డెన్ల తొలగింపు ఒట్టిదే : మంత్రి
- కాలేటివాగుపై స్పష్టమైన హామీనివ్వండి : ఎంపీ
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో నేతల గళం



జడ్‌పి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



హాజరైన జడ్‌పిటిసిలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న కలెక్టర్



మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి



మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మైదుకూరు ఎమ్మెల్యే



మాట్లాడుతున్న జడ్‌పిమాజీ చైర్మన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉందని, డిఎంఎఫ్, సీనరేజీ, నిర్వహణ ఖర్చులను వసూలు చేస్తూ ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని ప్రకటించడం హాస్యాస్పదమని వైసిపి సభ్యులు నిలదీశారు. మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ జేష్టాది శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఇసుక పంపిణీ చేయ డానికి సంబంధించిన తాత్కాలిక విధానమే ఇదని, రివర్ బెల్ట్‌లో ఇసుక తవ్వకాలపై సుప్రీం కోర్టు వ్యతిరేకత నేపథ్యంలో పూర్తిస్థాయి ఇసుక విధానానికి రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి భూసార పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరిం చాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించడం ద్వారా రైతాంగం నష్టపో యిందన్నారు. సకాలంలో ప్రీమియం చెల్లించకపోవడంతో అన్యాయానికి గురయ్యారని చెప్పారు. ఏటా జూన్ చివరి నాటికి ఇన్సూరెన్స్ లభించేదని, జులై గడుస్తున్నప్పటికీ ఎటువంటి కదలిక లేదని, ఏదైనా బటన్ నొక్కేలా చూడాలని వేంపల్లి జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి జోక్యం చేసుకుని తాము బటన్లు నొక్కబోమని, ప్రత్యా మ్నాయాల్ని అన్వేషిస్తున్నామని తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ 2019 ముందు రిజిస్ట్రరైన రైతులకు పిఎం కిసాన్ పడుతోందని, అనంతరం రిజిస్ట్రరైన రైతాంగం నష్టపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలను, రైతు భరోసా కేంద్రాల పనితీరును సమీక్షిస్తున్నామని, రాబోయే సమావేశం నాటికి రైతు ప్రయోజనాలే పరమావధిగా ముం దుకు వస్తామని చెప్పారు. బి.మఠం మండలం ముడమాల, మలుగుడుపాడు, మహదేవపల్లి, సింహాద్రిపురం, కాశినాయన మండలాల్లోని పలు పాఠశాలలకు ఉపాధ్యాయుల, భవనాల కొరత వేధిస్తోందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వంట ఏజెన్సీలు, వార్డెన్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లను తొలగిస్తామనే పేరుతో టిడిపి కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడు తు న్నారని చెప్పారు. మంత్రి స్పందిస్తూ చిరుద్యోగుల బెదిరింపులను పునరావృతంగా కానివ్వబోమని తెలిపారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల హౌసింగ్‌లో అవకతవకలు ఉన్నాయని, ఇళ్లు ఉన్న వారికి, ఆధార్ కార్డులు లేని వారికీ ఇళ్లు కేటాయించడంపై కమిటీ వేసి వాస్తవాలను నిగ్గు తేల్చాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి వారంలోపు వాస్తవాలను వెలుగులోకి తెస్తామని హామీనిచ్చారు. రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం ఒంటిమిట్ట ఎంపిడిఒ కార్యాలయంలో అధి కారులతో సమావేశం నిర్వహి ంచాడదని ప్రొటోకాల్‌కు విరుద్ధమని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సభ దృష్టికి తీసు కొచ్చారు. మంత్రి స్పందిస్తూ రాష్ట్రంలోని వైసిపి ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ సమస్యల్ని రానివ్వబోమని తెలిపారు. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ 2019 ముందు నిర్మించిన హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు రావడం లేదని, బాధిత లబ్ధిదారులకు సత్వరమే బిల్లుల చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోరుమామిళ్ల జడ్‌పిటిసి 2014 నుంచి 2019 వరకు హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు రాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. రైల్వేకోడూరు జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ రైల్వేకోడూరు ఎస్‌టి కాలనీలోని తాగునీటి బోరుకు కరెంటు కనెక్షన్ ఇవ్వకపోవడంతో తాగునీటి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పందించి తాగునీటి బోర్లకు రిక్విజిషన్ లెటర్ అందిన వెంటనే మానవత దృక్పథంతో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందించి జిల్లాలో వ్యవసాయ బోర్లకు కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం నెలకొందని, సామాన్య రైతులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాయచోటి- వేంపల్లి-ప్రొద్దుటూరు జాతీయ రహదారి, మైదుకూరు -పోరుమామిళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోవడంపై ప్రశ్నించారు. ఎన్‌హెచ్ ఇఇ స్పం దించి కాంట్రాక్టర్ చని పోవడంతో నిలిచిపోయాయని, పలు దఫాలుగా నోటీసులు జారీ చేశామని, చివరికి టెర్మినేట్ చేసే ఆలోచనల్లో ఉన్నామని వివరించారు. సిద్ధవటం మండలం మూలపల్లి ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిపోతోందని జడ్‌పిటిసి శ్రీకాంత్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లా డుతూ రాష్ట్రంలో వైసిపి కార్యకర్తలపై దాడులు చేయడం తగదని, ఇటీవలే వేంపల్లిలో వైసిపి కార్యకర్త తల పగుల కొట్టడం దారుణమని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ ఎటువంటి రాజకీయ కక్షలకు పాల్పడబోమని, వైసిపి హయాంలో చేసిన ప్రతీకార దాడులతో పోలిస్తే ఎంత శాతమో చెప్పాలని ప్రశ్నించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లా డుతూ రాజోలి జలా శ య ా న్ని నిర్మిస్తే కెసి కెనాల్ స్థిరీకరణ సాధ్యమన్నారు. ఫలితంగా 92 వేల ఎకరాలకు భద్రత లభి స్తుందని తెలిపారు. రాజోలి ముంపు ప్రాంతాన్ని కర్నూలు జిల్లా నుంచి కడప జిల్లాకు బదలాయించేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. చక్రాయపేట జడ్‌పిటిసి కాలేటివాగు రిజర్వాయర్ పనులతో రాయచోటి, మదనపల్లి, పీలేరు, పుంగనూరు ప్రాంతాలకు ప్రయోజనం చేకూ రుతుందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు పనుల్ని రాజకీయ కక్షల కారణంగా నిలిచిపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కడప ఎంపీ జోక్యం చేసుకుని కాలేటివాగు ప్రాజెక్టు పనులకు భరోసా ఇవ్వాలని కోరారు. మంత్రి స్పందిస్తూ పోలవరం ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపడుతున్నామని, కాలేటివాగు ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎందుకు చేపట్టబోమని ప్రశ్నించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని సమీక్షిస్తు న్నామన్నారు. పిఎల్‌ఆర్ కంపెనీ తప్పు చేయకుంటే ఎటువంటి కక్షలకు పాల్పడబోమని, తప్పు చేసినట్లు తేలితే ఉపేక్షిం చబోమని పేర్కొన్నారు. బి.మఠం ఎంపిపి మాట్లాడుతూ బ్రహ్మాసాగర్ గేట్ల మరమ్మతులు చేపట్టాలని, రిజర్వాయర్ ఖాళీగా మారిన నేపథ్యంలో మరమ్మతులు చేయడం సుల భమన్నారు. ఇరిగేషన్ సిఇ స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, రూ.1.60 కోట్ల శాశ్వత మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. సమావేశంలో ఎమ్మె ల్యేలు డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ కుమార్ యాదవ్, కలెక్టర్ లోతేటి శివశంకర్, గణేష్‌కుమార్, శ్రీధర్, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్క రించబడాలని, మండలాలలో ఎటువంటి సమస్యలు ఉన్న ఉన్నా, దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డిఒతో పాటు డివిజన్ పరిధిలోని తహశీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్‌ఎల్‌ఎ పరిధి దాటిన సమస్యలు, సిసిఆర్‌సి కార్డులు తదితరు అంశాలపై దృష్టి సారించి త్వరగా వాటన్నిటిని పరిష్కరించాలన్నారు. వారం వారం మండల తహశీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చాలని ఆర్‌డిఒను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డిఒ మోహన్‌రావు, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ శ్రీధర్ పట్టణంలోని సాతపల్లి అరుంధతి వాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్వాడీ కేంద్రంలోని సూపర్వైజర్, ఉద్యోగులను వివిధ విషయాలపై ప్రశ్నించారు. 13 మంది పిల్లలకు గాను ముగ్గురు పిల్లలు మాత్రమే ఉండడం, మధ్యాహ్నం 12 అయినప్పటికీ భోజనాన్ని తయారు చేయకపోవడం, రిజిస్టర్లను సవ్యంగా నిర్వహించకపోవడం పట్ల అంగన్వాడీ ఉద్యోగుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ సూపర్వైజర్ కేంద్రాలను తనిఖీ చేయకపోవడం పట్ల ఆమెపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంపై సూపర్వైజర్, కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. త్వరలో ఇదే అంగన్వాడీ కేంద్రానికి మళ్ళీ వస్తానని, పూర్తిస్థాయిలో అంగన్వాడీ కేంద్రం నిర్వహించబడాలని ఆదేశించారు. ఆర్‌డిఒ, తహశీల్దార్లు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఆర్‌డిఒ మోహన్‌రావు, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

నేటి ధర్నాలను విజయవంతం చేయాలి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాయడానికి ప్రయత్నం చేస్తున్నందుకు నిరసనగా బుధవారం జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ఆందోళనలను విజయవంతంవ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సిహెచ్ చంద్రశేఖర్, ఎ.రామాంజులు తెలిపారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా ప్రభుత్వ సంస్థలను అమ్మేయడమే ప్రధానమైన లక్ష్యంగా పనిచేస్తుందని విమర్శించారు. ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలు, మాత్రం, అమలు చేస్తున్నారన్నారు. పిఎఫ్, పెనాల్టీ, 25 శాతం నుంచి ఐదు శాతాన్ని తగ్గించాలన్నారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకింగ్, డిఫెన్స్, రైల్వే, పోర్టులో, ఎయిర్ పోర్టులు, రోడ్లు ఇలా ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రయివేటీకరించడం దుర్మార్గమని తెలిపారు. కార్మిక వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నం చేయడం దారుణం అని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి స్కీం వర్కలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అంగనవాడీ, ఆశా, యానిమేటర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. అంగన్వాడీలు, గత ప్రభుత్వంలో, పోరాడే సాధించుకున్న హక్కులకు జీవోలు విడుదల చేయాలన్నారు. జులై నుండి వేతనాలు పెంచాలని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని , విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని తెలిపారు. రాష్ట్రం లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులను అరికట్టాలన్నారు. అధికారం లోకి వచ్చిన వెంటనే అంగన్వాడీలకు, ఆశాలకు, మున్సిపల్, కాంట్రాక్టు, అప్కాస్ ఉద్యోగులకు జీతం పెంచుతామని హామీ ఇచ్చిందని, నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ విద్యుత్తు, ఎపిఎండిసి కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఒపిసి పెన్షన్ అమలు చేయాలన్నారు. జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ఆటో, హమాలీ, బిల్డింగ్, తోపుడు బండ్లు, బీడీ, తదితర అసంఘటిత కార్మికులు, సమస్యల పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు , ప్రభుత్వ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'పది' మూల్యాంకన పారితోషికం చెల్లించండి : యుటిఎఫ్



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

2023- 2024 మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల మూల్యాంకన విధులలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల, రెమ్యూనరేషన్ ఇంతవరకు అరకొరగా మాత్రమే చెల్లించారని, వెంటనే పూర్తి స్థాయిలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో యూటిఎఫ్‌గా ఆందోళన చేపడతామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ తెలిపారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాశ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్‌సి మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు వెంటనే వారికి చెల్లించాల్సిన టిఎ, డిఎ రెమ్యునరేషన్ వెంటనే చెల్లించేందుకు తీసుకోవాలని ప్రాతినిధ్యం చేస్తూ పది రోజుల లోపల ఈ సమస్యను పరిష్కరించకపోతే డిఇఒ కార్యాలయం దగ్గర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. 2023 ఏప్రిల్ నెలలో జరిగిన పదవ తరగతి మూల్యాంకన విధులకు సంబంధించి ఇంతవరకు పూర్తిగా రెమ్యూనరేషన్ చెల్లించనందువల్ల గతంలో అనేకసార్లు జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకుని వెళ్లినప్పటికీ ఎటువంటి స్పందన లేని కారణంగా కలెక్టర్‌ను కలిసి విన్నవించామని చెప్పారు. ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యూనికేషన్ 10 రోజుల లోపల చెల్లించాలని లేనియెడల డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో చిన్నమండెం మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాయచోటి మండలం యుటిఎఫ్ నాయకులు అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

క్విజ్‌లో శ్రీసాయి కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు నేషనల్ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రతిభ పాటవాలను ప్రదర్శించి ప్రత్యేక గుర్తింపు పొందారని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ సైన్స్ డే సందర్భంగా అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీలలో సదరన్ రీజియన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా చందన, రెడ్డి అబ్దుల్లా, రెడ్డప్పరెడ్డి కైవసం చేసుకున్నారు. అలాగే కన్సోలేషన్ విభాగంలో ధన కిషోర్, బాబ్జాన్ ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎడిఎం సంస్థకు చెందిన డీ గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్ వినోద్ కుమార్ మౌర్య, సి గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్ వివేక్ కుమార్ యాదవ్, కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించి జ్ఞాపికలు ప్రశంసా పత్రాలను అందజేశారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రయివేటు పాఠశాలల్లో చదివే పిల్లలకు సైతం తల్లికి వందనం కార్యక్రమాన్ని వర్తింపజేయాలని మదనపల్లె విజయభారతి విద్యా సంస్థ కరస్పాండెంట్ డాక్టర్ సేతు కోరారు. మంగళవారం కడపలో పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన కె.సామ్యూల్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సేతు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లోనూ పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులే చదువుతున్నట్లు శామ్యూల్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి విద్యార్థులకు కూడా తల్లికి వందనం కార్యక్రమం వర్తింపచేయడం వల్ల తల్లిదండ్రులకు భారం తగ్గి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. స్పందించిన ఆర్‌జెడి శామ్యూల్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానన్నారు.

ఉచిత ఇసుకతో ఊపందుకున్న నిర్మాణ రంగం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానంతో నిర్మాణ రంగం తిరిగి ఊపందుకున్నదని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిన సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి చమర్తి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పరిపాలనలో జగన్మోహన్‌రెడ్డి అడ్డగోలు విధానాల వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇసుక కొనలేని స్థితికి చేరి తద్వారా అన్ని రంగాలు కుదేలయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే అధికారంలోకి వచ్చిన ఒక్క మాసంలోనే ఉచిత ఇసుకను ప్రజలకు అందించడం గర్వనీయమన్నారు. భవన నిర్మాణ కార్మికులు మాట్లాడుతూ ఇసుక లభించక గత ఐదేళ్లలో తాము దుర్భర జీవితాలు అనుభవించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఉచిత ఇసుక విధానంతో తిరిగి తమ కుటుంబాలలో వెలుగులు నిండుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు రవాణా శాఖ మాజీ డైరెక్టర్ గుల్జార్‌బాష, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి అమ్మినేని అజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు సతీష్ కుమార్ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబు బకర్, రాజంపేట మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎస్.కె.కరీమ్, శవనవారిపల్లి సర్పంచ్ కోటయ్య నాయుడు, సీనియర్ నాయకులు సుబ్బరాజు, తెలుగు యువత పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి జగదాభి పాండురాజు, హస్తివారి పల్లెరామ్మోహన్ రాజు, ఒంటిమిట్ట శివారెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక విధానం హామీ నెరవేర్చడం హర్షణీయమని బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బలరాం అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలలు వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసినందుకు ఉమ్మడి జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుకున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పేదల సొంతింటి కల నేరవేరడమే కాకుండా నిర్మాణ రంగం ఊపందుకుని 40 లక్షల మంది కార్మికులకు ఉపాధి భరోసా లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అలీ బేగ్, రసూల్, ఎన్టీఆర్ నఫీస్, రమణయ్య, మహబూబ్ బాష, షణ్ముగం, రామయ్య, వెంకటరమణ, కృష్ణ, మునిరత్నం, జయరాం నాయుడు, సయ్యద్, లక్ష్మయ్య, ఎజాస్, పోతయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సోమవారం ఉచిత ఇసుకను అమల్లోకి తీసుకురావడంతో మదనపల్లె బిల్డర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే షాజహాన్ బాషను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి హామీని నిలబెట్టుకుని ఇసుకను ఉచితంగా ప్రజలకు అంకితం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

'ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ తప్పనిసరి'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎపి మోడల్ స్కూళ్లతో పాటు అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ట్రైనింగ్ కమిషనర్, రాయలసీమ జోనల్ ఇన్ ఛార్జి ఉమాదేవి తెలిపారు. మంగళవారం రాయచోటిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం పెంపొందడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్స్ శిక్షణ ద్వారా విద్యార్థులలో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం అలవడుతుందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరతాయన్నారు. కాబట్టి ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటుకై తమ పాఠశాల తరపున మొదట రూ. 381 రూపాయలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిట్లను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. తమ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులలో ఒకరిని స్కౌట్స్ మాస్టర్‌గా, మరొకరిని గైడ్స్ కెప్టెన్‌గా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నియమించు కోవచ్చున్నారు. అనంతరం విద్యార్థుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. గత సంవత్సరం యూనిట్ ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ చేసిన వారు ఈ సంవత్సరం కూడా రెన్యువల్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. బాలురు (స్కౌట్స్), బాలికలు(గైడ్స్) తో కూడిన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్‌లలో బాలురకు ఒక యూనిట్, బాలికలకు మరొక యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే అదనపు యూనిట్లను కూడా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్ శిక్షణను ఇచ్చి వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తారన్నారు. జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లో చేరిన విద్యార్థులకు రెండేళ్ల శిక్షణ కార్యక్రమం, క్యాంపులలో భోజన వసతి ఉచితంగా అందిస్తారని తెలిపారు. విద్యార్థులకు అందించే రెండేళ్ల శిక్షణలో త్రితీయసోపానం, రాజ్య పురస్కార్ కోర్స్ ఎగ్జామ్స్ నిర్వహించి ప్రతిభ చూపిన వారికి గవర్నర్ చే జారీ చేయబడిన సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ ఉన్నవారికి జీవో నెంబర్ 27 ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంబేపల్లి, రామాపురం మండలాల కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లోని భారత్ గైడ్స్ యూనిట్లను తనిఖీ చేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యకలాపాల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ రాధా, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, గైడ్ కెప్టెన్లు రమీజా, పుష్పాంజలి, హేమలత పాల్గొన్నారు.



స్కౌట్ విద్యార్థులతో స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ ఉమాదేవి



గర్భిణులను పరీక్షిస్తున్నడాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కలకడ

గర్భిణులకు వైద్య పరీక్ష నిర్వహించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉపకేంద్రాల వారీగా 108 వాహనంలో గర్భిణులను తీసుకొని వచ్చి వారికి వైద్య పరీక్షలు నిర్వ హించారు. బిపి, షుగర్, హెచ్‌బి, బ్లడ్ గ్రూప్స్, ఆర్‌బిఎస్, యూరిన్, తదితర రక్త పరీక్షలు చేశారు. 42 గర్భిణులను గుర్తించి వారిలో 12 మంది కాన్పు కష్టతరమైన గర్భిణులను ఉన్నత ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు తెలిపారు. రక్తహీనత తక్కువ ఉన్నవారికి ఐరన్, సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్‌బాబు, ఎంపిహెచ్‌ఇఒ జి.జయరామయ్య, పిహెచ్‌ఎన్ కె.సుబ్బరత్నమ్మ ,హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్‌అహ్మద్, ఫార్మసిస్ట్ షేక్ షరీఫ్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పిలు లావణ్య, అశ్వని, రాజసులోచన, కనకమ్మ, గోపి కృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు వాణి, రమణమ్మ, వరలక్ష్మి, లక్ష్మి, లక్ష్మి దేవి, భాగ్యమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెంగళూరుకు ఆర్‌టిసి సర్వీసును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి డిపోకు చెందిన బెంగళూరుకు వెళ్లే ఆర్‌టిసి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాయచోటి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు గాలివీడు నుంచి పెద్దమండెం, తంబళ్లపల్లి, బి.కొత్తకోట, ములకలచెరువు మీదుగా బెంగుళూరుకు వెళ్లేదని తెలిపారు. రాయచోటిలో ఉదయం 5.30గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2గంటలకు బెంగుళూరు చేరుకొని తిరిగి మధ్యాహ్నం 3గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రాత్రి 8.30 గంటలకు రాయచోటికి చేరేదని తెలి పారు. మండల పరిధిలో ఉన్న అనేకమంది బెంగళూరు సెయింట్ జోన్స్ హాస్పిటల్ కి వెళ్లడానికి, అక్కడ జీవనం చేసుకున్న అనేక మంది రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉన్న బస్సు సర్వీసును గతం వారం రోజులుగా ఆర్‌టిసి అధికారులు నిలిపి వేశారని అన్నారు. బెంగ ళూరుకు వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా ఉన్న బస్సు సర్వీసును నిలిపివేయడం పట్ల ప్రయాణీకులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణీకులు అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెంగళూరుకు వెళ్లే ఆర్‌టిసి బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని కోరుతున్నారు. లేకుంటే రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని మండల టిడిపినాయకులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో హెల్పర్‌కు గాయాలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ మంగళపల్లి౹ చెందిన హెల్పర్ గాలివీటి వేణుకు విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. మంగళవారం ఉదయం కొత్తపల్లి వద్ద విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మెన్ ఉదయ్‌తో ఎల్‌సి తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి కనెక్షన్ ఇస్తుండగా కుడి చేయి విద్యుదాఘాతానికి గురై దిమ్మె పైనుంచి కింద పడ్డాడని తెలిపారు. కుడి చేయి గాయం కావడంతో 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



పట్టుపురుగులను పరిశీలిస్తున్న సెరికల్చర్ ఎడి రామమోహన్

పట్టు పురుగులతో అధిక లాభాలు

- సెరికల్చర్ ఎడి రామమోహన్

ప్రజాశక్తి-పెద్దమండ్యం

బైవోల్టిన్ హైబ్రిడ్ పట్టుపురుగుల వలన అధిక లాభాలు పొందవచ్చని సెరికల్చర్ ఎడి రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పాపేపల్లి పంచాయతీ చల్లవారిపల్లి లోబైవోల్టిన్ పట్టుపురుగులు పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బైవోల్టిన్ పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టినట్లయితే అధిక లాభాల పొందవచ్చుని అన్నారు. ప్రభుత్వం పట్టుపురుగులు పెంపకం కోసం ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తుందని, అని తెలిపారు. ఒక ఎకరా మల్బరి సాగుకు రూ.30వేలు ఇస్తున్నదని, ఎస్‌సి, ఎస్ టిలకు పదిశాతం, ఇతర కులాల వారు 25శాతం రైతు వాటా చెల్లించాలని తెలి పారు. పట్టుపురుగుల పెంపకం గదికి వెయ్యిచదరపు అడుగులు కలిగిన దానికి రూ.4లక్షలు, 700చదరపు పట్టుగూళ్ల పెంపకం గదికి రూ.3లక్షలు, ప్రభుత్వం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి 10 శాతం, ఇతరులు 25శాతం రైతు వాటా చెల్లించాలని అన్నారు. పట్టు బైవోల్టిన్ పట్టు గూళ్ళను విక్రయించడానికి మదనపల్లి మార్కెట్ అందుబాటులో ఉందని తెలి పారు. ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో సిరికల్చర్ అధికారులు శ్రీనాథ్‌రావు, రైతులు రమణారెడ్డి, తిమ్మారెడ్డి, చంద్ర బాబు రెడ్డి పాల్గొన్నారు.

బిసిజి టీకా తప్పనిసరి

ప్రజాశక్తి-మదనపల్లి

ఆరు వర్గాల వారు బిసిజి టీకా తప్పనిసరిగా తీసుకోవాలని, క్షయ వ్యాధి లేని సమాజం కొరకే పెద్దలకు బిసిజి టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టినదని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్ అన్నారు. కురబలకోట వైద్యులు డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బిసి కాలనీ, ఎస్‌సి కాలనీ, తెట్టు, నందిరెడ్డిగారిపల్లెలో ప్రజలకు పెద్దల బిసిజి టీకా ప్రాముఖ్యత, డయేరియా నివారణ చర్యలు, డెంగీ వ్యతిరేక మాసోత్సావాలపై అవగాహన కల్పించారు. 60 ఏళ్లు పైబడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్థులు, బీడీ, సిగరెట్ తాగువారు, టిబి జబ్బు వచ్చి తగ్గిపోయి బాగైన వారు, టిబి రోగి కాంటాక్ట్స్, ఎత్తుకు తగ్గ బరువు 18 కంటే తక్కువ ఉన్న వారు పై తెలిపిన ఆరు వర్గాలవారు బిసిజి టీకా తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు. ఇకపై ప్రతీ సోమ, గురువారాలలో బిసిజి టీకాలు సంబంధించిన ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలిపారు. టీకాతో భయాందోళన చెందనవసరం లేదని, సురక్షితమైనదని అన్నారు. వైద్యసిబ్బంది, ఆశాలు ప్రజలకు టీకాపై అవగాహన కల్పించాలని సూచించారు. వయోజనులంతా టీకాను తప్పక వేయించుకోవాలని సూచించారు. క్షయ రహిత దేశం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలు టీకాపై భయాందోళన వీడి టీకా వేయించుకోవాలన్నారు. అనంతరం నందిరెడ్డిపల్లిలోని మసీద్‌లో మత పెద్దల ఆధ్వర్యంలో జమాత్ బిసిజి టీకా టీకాపై అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం డయేరియా, డెంగీ నివారణ చర్యల్లో భాగంగా చేతుల శుభ్రతలోని 6 దశలను మరియు ఒఆర్‌ఎస్ ద్రావనం ఎలా తయారు చేసుకోవాలని చేసి చూపించారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ రమణ, సబ్ యూనిట్ అధికారి కలీల్, ఎల్‌హెచ్‌పిలు భారతి, సునీత, ఎఎన్‌ఎంలు హుస్సేన్ బి, ఆర్తీఫా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉద్యాన పంటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో రైతులకు ఉద్యానవన పంటల సాగుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఉపాధి హామీ టెక్నికల్ ఫీల్డ్ అసి స్టెంట్లను ఎంపిడిఒ కృష్ణమూర్తి ఆదేశించారు. మంగళవారం స్త్రీశక్తి భవన్‌లో ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం ద్వారా సన్నకారు రైతులు ఉద్యానవన పంటలు సాగు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఎపిఒ అంజనప్ప మాట్లాడుతూ పండ్లతోటలు, పూల తోటలతో పాటు పాడి రైతులు పశుగ్రాసం పెంచుకోవచ్చని అన్నారు. మామిడి మొక్కలు నాటుకుంటే ఎకరాకు 70 మొక్కలకు మూడు సంవత్సరాల పాటు రూ.99,911లు సంరక్షణ కోసం ఇస్తారని అన్నారు. అల్లరి నేరేడు మొక్కలు ఎకరాకు 40 మొక్కలు నాటితే రూ.61వేలు, టెంకాయ మొక్కలు ఎకరాకు 60మొక్కలు నాటితే రూ.88,300లు, పాడి రైతులు గడ్డి పెంపకానికి ఒక ఎకరాకు రెండు సంవత్సరాలలో రూ.40వేలు ఇవ్వడం జరుగు తుందని అన్నారు. వీటితో పాటు రకరకాల పూల తోటలు కూడా పెంచుకోవచ్చన చెప్పారు. రైతుల తమ పొలాలను గట్లు వేసుకోవడం పారంపాండ్ వంటి నిర్మాణాలు కూడా చేపట్టవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధి ఇంజినీర్ రామన్న, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏడాదిగా వెలగని వీధి దీపాలు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో గత సంవత్సరం నుంచి వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలుపేర్కొన్నారు. ఏడాది నుంచి వీధి దీపాలు లేకున్నా పట్టించుకునే నాధుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. సుండుపల్లె పంచాయతీ ఇఒపిఆర్‌డి సురేష్ ఆధ్వర్యంలో పరిపాలన సాగుతుందని అన్నారు. ఐదు సంవత్సరాల నుంచి సర్పంచ్ కూడా ఈ పంచాయతీకి లేరని, ఈ పంచాయతీ కోర్టులో ఉండటం వల్ల ఎన్నికలు ఆగిపోయాయని తెలిపారు. అప్పటి నుంచి ఇఒఆర్‌డి ఆధ్వర్యంలో పాలన నడుస్తుందని చెప్పారు. టౌన్ పరిధిలో పశువుల సంత, కూరగాయల సంతలోనే దాదాపుగా 25 లక్షల పైనే ఆదాయం వస్తోందని అన్నారు. పంచాయతీ వస్తున్న ఆదాయంపై లెక్కలు కూడా చూపలేదని పలువురు ప్రజలు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు మండల సర్వ సమావేశంలో ఇఒపిఆర్‌డి నిలదీయడం కూడా జరిగిందని ఇంతవరకు ఎలాంటి సమాధానం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి సుండుపల్లిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.



వెలగని వీధి దీపం

సురక్షిత మాతృత్వానికి ఆరోగ్య పరీక్షలు : డాక్టర్



గర్భిణులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్

ప్రజాశక్తి-పీలేరు

సురక్షిత మాతృత్వం కోసం గర్భిణులకు నిర్దేశిత రోజుల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్య మెలకువలు తెలుసుకోవడం ఆవశ్యమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. మండలంలోని తలుపుల పిహెచ్‌సిలో పిఎన్‌ఎస్‌ఎంఎ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువుతో పుట్టే శిశువులను భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు బాధించే ప్రమాదం లేకపోలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య సేవల్లో భాగంగా ప్రభుత్వం అందించే అన్ని రకాల ఆరోగ్య పథకాలు, మెరుగైన ఆరోగ్య సేవలను ప్రతి గర్భవతీ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర సంతతిని సమాజానికి అందివ్వాలని చెప్పారు. అందుకోసం ప్రతి నెలా జరిగే పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమంలో ప్రతి గర్భిణీ ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భవతులకు అధిక రక్తపోటు, మధుమేహం, ఆల్బుమిన్, హిమోగ్లోబిన్ శాతం నిర్ధారణ మొదలైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, ఐరన్ ఫోలిక్ యాసిడ్, అల్బెన్డజోల్ 400 యంజి మాత్రలు, అదనపు అవసరమగు మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరీక్షలకు హాజరైన 32 మంది గర్భవతులకు స్థానికంగా విధులు నిర్వహిస్తున్న నాగవేణి సహకారంతో పాలు, బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్‌ఎంలు నాగవేణి, ఫామున్నిసా, సిహెచ్‌ఒ కుముద, లావణ్య, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు. **రేగళ్ల పిహెచ్‌సిలో...** ప్రతి నెల 9న నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని మండలంలోని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ డాక్టర్ కార్తీక్ కుమార్, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత రాకుండా ఐరన్ మాత్రలు, కాల్షియమ్, విటమిన్ మాత్రలు ఇచ్చారు. రక్త హీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహారం, ప్రమాదకర గర్భిణీ లక్షణాలు, ప్రభుత్వ పథకాలు, టీకాలు, తల్లి పాలు, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, తదితర సేవల గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ జయలక్ష్మి, హెచ్‌ఇ ఉషారాణి, సూపర్వైజర్, రమాదేవి, చిన్నప్ప, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కళలను ఆదరించి, కళాకారులకు చేయూతనివ్వాలని ప్రముఖ సినీ నటుడు జబర్దస్త్ ఫేమ్, శ్రీదేవి డ్రామా కంపెనీ కొరియోగ్రాఫర్ రాము మాస్టర్, సినీ దర్శకుడు శివమణిరెడ్డి అన్నారు. మంగళవారం పెనిగలపాటి శివప్రసాద్ ఆధ్వర్యంలో శివ డాన్స్ అకాడమీ రెండవ బ్రాంచి నూనెవారిపల్లిలోని సాయి విద్యాలయ పాఠశాల వద్ద ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగాసినీ కొరియోగ్రాఫర్ రాము మాస్టర్, దర్శకుడు శివమణిరెడ్డి, 27వ వార్డు కౌన్సిలర్ రేనాటి రాఘవేంద్ర వర్మ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి సంప్రదాయబద్ధంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నృత్య సాధన వలన మానసిక, శారీరక రుగ్మతలు తొలగుతాయన్నారు. డాన్స్ మాస్టర్ శివ అంకితభావంతో రాజంపేట ప్రాంతంతోపాటు కడప, అన్నమయ్య జిల్లాలలో ఎంతోమందిని నృత్య కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారని, 21 ఏళ్లుగా అపార అనుభవం కలిగిన శివ మాస్టర్ వద్ద శిక్షణ పొందిన అనేకమంది కళాకారులు నేడు నృత్య గురువుగా చలామణి అవడం గర్వకారణమని తెలిపారు. నృత్య కళాకారుడు శివ మాస్టర్ మాటాడుతూ తనను ఇంతకాలం ఆదరించిన రాజంపేట ప్రజలకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. తాము కూచిపూడి, జానపదం, సినీ నృత్యం, కోలాటం వంటి వివిధ సాంస్కృతిక కళలలో శిక్షణ ఇస్తున్నామని, తమ రెండవ బ్రాంచ్ ని కూడా ఆదరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను అలరించాయి. కార్యక్రమంలో నృత్య కళాభిమానులు, డాన్స్ మాస్టర్లు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శివ డ్యాన్స్ అకాడమిని ప్రారంభిస్తున్న కొరియోగ్రాఫర్ రాము

తంబళ్లపల్లెను అభివృద్ధి చేస్తాం



సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలతో కూటమి నాయకులు

ప్రజాశక్తి-ములకలచెరువు

కూటమి ప్రభుత్వంతో తంబళ్లపల్లెలో అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ద, జనసేన ఇన్‌ఛార్జిలు పోతుల సాయినాథ్ అన్నారు. మంగళవారం తంబళ్లపల్లె టిడిపి నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు కదిరినాథునికోట సచివాలయానికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాన్ చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యంగా మారిందని అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండడంతో తంబళ్లపల్లెను అన్ని విధాల అభివృద్ధి పరుచుకోవచ్చుని తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామన్నాని చెప్పారు. ఉచిత ఇసుకను ప్రతి లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, బాస్కర్రెడ్డి, కేశవులు, కెవి రమణ, ప్రతాప్నాయుడు, నరసింహులు, రెడ్డెప్ప, శ్రీనివాసులు, నాగేంద్ర, అనిల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి పులివెందుల సమస్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి విజయవాడలో మంగళవారం వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల, మార్కెటింగ్, సహకార, మత్స్యకారు శాఖ, మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్య ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. వారిని కలిసి సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రులు పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

అన్నదానం.. మహాదానం

ప్రజాశక్తి - కొండాపురం :అన్నదానం.. మహాదానమని కొండాపురం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సుజాత తెలిపారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి నెల పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమం రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ కొండాపురం వారు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తల్లి, బిడ్డ క్షేమం కోరి రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు ప్రతి నెల గర్భిణులకు పౌష్టికాహారం అందించడం ఎంతో శ్రమతో కూడుకున్న పని అన్నారు. విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన తిమ్మయ్యగారి క్రిష్ణారెడ్డి మంగళవారం కార్యక్ర మానికి ఆర్థికసాయం అందించారని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి ఆలమూరు జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఇలా ఆర్థిక సాయం ఎవరైనా అందించవచ్చని తెలిపారు. ఇలా చేసే ఆర్థిక సహాయం ఎంతో విలువైందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవల ప్మెంట్ సొసైటి మండల నాయకులు హనుమంతరెడ్డి, డాక్టర్ మహదేవరెడ్డి ఆస్పత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, 80మంది గర్భిణులు పాల్గొన్నారు.

పాలిసెట్-24 చివరి దశ నోటిఫికేషన్ విడుదల

- ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు

2024-25 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలలో చేరుటకు చివరి దశ నోటిఫికేషన్ విడుదలైందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఫీజు చెల్లిం చవచ్చన్నారు. మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నారని, మూడేళ్ల డిప్లొమా పూర్తి అయిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. డిప్లమో తర్వాత బీటెక్ చేయుటకు ఈసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఆగిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణం

ఆగిన అంగన్వాడీ భవన నిర్మాణాలు

-పట్టని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో గత ప్రభుత్వంలో మంజూరైన అంగన్వాడీ భవన నిర్మాణాలు ఆగిపోయాయని అంగన్వాడీ కార్య కర్తలు పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొన్ని భవనాలను గోడల వరకు నిర్మాణాలు చేపట్టారని, కొన్నింటికి స్లాబులు వేశారని చెప్పారు. కొన్ని భవనాలకు మెటీరియల్ కూడా పంపించడం జరిగిందని, ఖాతాలో నగదును జమ చేశారని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు అవుతున్నా అధికారులు దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగిపోయిన అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన శాగల వెంకటేష్ (26) అనారోగ్య రీత్యా ఆకస్మికంగా మృతి చెందాడు. మృతుడికి భార్య , ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మృతి పట్ల కుటుంబ సభ్యులు భార్య పిల్లలు కన్నీటి పర్యంతమయ్యా రు. విషయం తెలుసుకున్న రెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబ సభ్యులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మృతుడు కుటుంబానికి అన్నివేళలా తోడుంటానని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మృతుడికి రావాల్సిన ఆర్థిక సాయం కూడా తీసుకురావడానికి సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

కడప పట్టణంలోని ఆర్ అండ్‌బి బంగ్లా నందు రాష్ట్ర రవాణా శాఖ, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధి గురించి ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కేజేపి రెడ్డయ్య, మాజీ జెడ్పిటిసి నాయుడోరి రమణ,రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులేల రమేష్,మాజీ ఎంపిటిసి కట్టా లోకేష్, ఆర్‌టిఎస్ కో-ఆర్డినేటర్ తుంగ నవీన్,రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి బుంగటావల రాజశేఖర్, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు ధన, యూనిట్ ఇంచార్జ్ బిల్లా కిష్టయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాకర్ల రెడ్డయ్య, వెంకటేశ్వర్లు,బూత్ ఇంచార్జ్ దుర్గినేశ్వరయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుడి అరెస్టు చూపిస్తున్న డిఎస్‌పి, పోలీసు సిబ్బంది

భార్య హత్య కేసులో భర్త అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్య హత్య కేసులో నిందితుడైన భర్తను మంగళవారం మదనపల్లె రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో నిందితుడిని అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. పలమనేరు పట్టణానికి చెందిన గణపతి అలియాస్ వెంకటేష్ తొమ్మిదేళ్ల క్రితం పెనుమూరు కార్తికేయపురంకు చెందిన భారతి(26)ని వివాహం చేసుకున్నాడని తెలిపారు. వీరికి ఇద్దరు కుమారులు. గణపతి కూలి పనులు చేస్తుండగా భారతి పలమనేరులో పూలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకునేవారని అన్నారు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసైన గణపతి భార్యపై అనుమానం పెంచుకొని పలుమార్లు కొట్టడం, తిట్టడం చేసేవాడని దీంతో భర్తతో వేగలేక భారతి ఏడాదిన్నర క్రితం నెల్లూరు పట్టణం కోవూరు వద్ద ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయినట్లు తెలిపారు. అక్కడ రవి అనే వ్యక్తితో సన్నిహితంగా ఉండేదని తెలిపారు. భార్యపై కక్ష పెంచుకున్న గణపతి ఎలాగైనా ఆమెను అంతమొందించాలని పతకం పన్నాడని పేర్కొన్నారు. జూన్ 27న బిడ్డలను ఇస్తానని భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించి తన వద్దకు పిలిపించుకున్నాడని తెలిపారు. బిడ్డల కోసం వచ్చిన భార్యని నమ్మించి నిమ్మనపల్లి సమీపంలోని దివిటివారిపల్లె సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఆవేశానికి గురైన గణపతి తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్య గొంతు కోసి హత్య చేశాడని తెలిపారు. అదే సమయంలో పొలం వద్దకు వచ్చిన రామాంజులు సంఘటన ను చూసి కేకలు వేయడంతో గణపతి అతనిపై కూడా దాడి చేసే గాయపరిచి పరారయ్యాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు కోసం గాలింపు చేపట్టారని అన్నారు. మంగళవారం స్థానిక నిమ్మనపల్లి సర్కిల్ వద్ద నిందితుడు గణపతిని అదుపులోకి తీసుకుని విచారించడంతో తానే భార్య భారతిని హత్య చేసినట్లు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందుతున్ని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన సిఐ సద్గురుడు, ఎస్ఐ లోకేష్ రెడ్డి, కానిస్టేబుళ్లను డిఎస్‌పి అభినందించారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నాటు సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మదనపల్లె మండలం నడిమితాండాకు చెందిన బుక్యా లక్ష్మమ్మ(58) నిషేధిత నాటు సారాను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు చేపట్టినట్లు తెలిపారు. సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఆమె వద్ద 10 లీటర్ల నాటు సారా దొరకడంతో సారాను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నిందితురాలి అరెస్టును చూపుతున్న ఎస్ఐ రవికుమార్